# ఇంటి దీపం...

'పెద్దవాడికి సెలవు దొరకదు. దొరికినా బొంబాయినుంచి రావడమంటే బోలెడవుతుంది...'

'కనక చిన్నవాడికి రాస్తానంటావు, అంతేనా?'

'ఎవ్వరికీ రాయద్దు...'

భర్త కొంచెం కఠినంగా అన్నాడు.

అందుకామె నొచ్చుకుంది. 'పోనీ అమ్మాయికైనా రాయనా?'

'ఎవ్వరికీ రాయద్దన్నానా..'

'ఇంత వయసొచ్చినా, మీ మొండితనం కాస్తకూడా తగ్గలేదు. వచ్చే వారం మీకు ఆపరేషను జరుగుతుందాయె. ఎవ్వరూ దగ్గర లేకపోతే ఎలా చెప్పండి... 'చంటిపిల్లాడికి నచ్చ చెప్పినట్లుగా చెప్పింది.

భర్త కొంచెం మెత్తపడినట్టు అనుకుంది. అందుకు భర్త చెప్పిన సమాధానం విని తాను తప్పులెక్కవేశానని అనుకుంది. బాధపడింది.

'ఎవరొచ్చి మాత్రం ఏంచేస్తారని... ఆసుపత్రిలో వుండేవాణ్ణి నేను; బాధ అనుభవించే వాణ్ణినేను, ఆసుపత్రికీ, యింటికీ మధ్య తిరిగేందుకు నువ్వున్నావు. ఆ యిబ్బంది యేదో నువ్వు పడతావు...?

రెండు క్షణాలు మౌనం వహించి ఆయన మళ్లీ యిలా అన్నాడు. ఆమాటలు శూలాలవలె ఆమెకు గుచ్చుకున్నాయి.

'వర్థి తిండి దండగ, వచ్చిన వాళ్ళకి వంట వార్పులు చేసి పెట్టలేక నువ్వు సతమతమై పోయావు. అసలే నాకొచ్చే పెన్షన్ డబ్బులు అంతంత. ఆపరేషన్ ఖర్చులే భరిస్తామా, వచ్చే వాళ్ళకి అన్నీ అమర్చి ఆ ఖర్చులే భరిస్తామా?

ఖర్చుల విషయం గుర్తుకి రావడంతో ఆమె మూగనోము పట్టక తప్ప లేదు. భర్తను దీనంగా చూసింది. ఆమె మనోవ్యధను ఆయన గుర్తించాడు. ఓదారుస్తున్నట్టుగా చెప్పాడు.

'నీ బాధ నాకు తెలుసు. నిన్ను బాధ పెట్టాలని నా ఉద్దేశం కాదు. తన మన అంటూ ఎవరైనా వస్తే, నీకు కొంచెం ఆసరాగా ఉంటారు... కాని మన పిల్లల మనస్తత్వాలు ఎలాంటివో నాకంటె నీకు బాగా తెలుసు. ఇవతలి చెంబు తీసి అవతల పెట్టరు కోడళ్ళు, మన యింట్లో వాళ్ళేమైనా పని చేస్తే అది చూసి సహించరు మన పుత్రరత్నాలు... మనకు సహాయ మంటావా, పక్కింటివాళ్ళు ఎదురింటివాళ్ళు వు,డనే వున్నారు. నోరు మంచిదైతే ఎప్పుడూ వూరు మంచిదే...?

'ఈ విషయానిక్కూడా యింత రాద్ధాంతం జరగాలా? ఆమె చికాకు బయటపడింది.

'అవునవును... నేను చేసేది రాద్ధాంతం... ఏది చెప్పినా...' అర్ధాంతరంగా మాట ముగించాడు.

ఎదురింటి ఆరుముగం గేటు తెరుచుకుని లోనికి వస్తున్నాడు. అది ఆయన గమనించాడు.

'రండి, రండి...'

'మీరు రమ్మనకుండానే వస్తున్నాను, అంటూ కుర్చీ దగ్గరికి లాక్కుని కూర్చున్నాడు ఆరుముగం.

'అదే ఆత్మీయుల అనుబంధం' ఆయన ముఖంలో నవ్వు కనిపించింది.

'మీకు ఆపరేషన్ జరిగే రోజున నేను ఊళ్ళో ఉండను సరిగ్గా సమయం చూసి మా బాస్ నన్ను పొరుగూరికి వెళ్ళమన్నాడు... సరే అనక తప్పలేదు...' ఆరుముగం నొచ్చుకున్నాడు.

'మీరు చూపుతున్న ఆప్యాయతే నాకు సగం బలం...'

''మీరేమీ అనుకోకపోతే ఒకటి చెప్పాలనే వచ్చాను''

ఆయన ఆదుర్దా కనబరచాడు. ఆరుముగం జేబులోంచి ఒక కవరు తీసి ఆయన చేతిలో ఉంచాడు. 'ఇది వుంచండి' అన్నాడు.

కవరు తెరిచి చూస్తూ 'ఏమిటండీ యిది ఆరువుుగం గారూ?' అన్నాడు.

'ఇప్పుడు మీరు అవసరంలో వున్నారు. అవసరానికి పనికొస్తుంది. మీ తమ్ముడుగా నేను చేస్తున్న సహాయ మనుకోండి. అంత మాత్రం సహాయం చెయ్యడం తమ్ముడికి హక్కు లేదా?'

'నన్ను మీరుమూగవాణ్ణి చేస్తున్నారు...' అంటుండగా ఆయన శ్రీమతి కాఫీగ్లాసులతో అక్కడికి వచ్చింది.

'క్షేమంగా వున్నారా?' ఆమె నోరార పలకరిస్తూ ఆరుముగం చెంత కాఫీగ్లాసు ఉంచింది. మరొకటి భర్తకు అందించింది.

'పాపం మామికిదా తలకు మించిన పని...?

'చూశావా సరూ... ఆరుముగంగారు ఏడువందలిచ్చారు... అవసరానికి వుంచుకోమంటున్నారు...'

'నాకు యాభైయేళ్ళు దాటినా, నన్నింకా సరూ పిలవడమే మీ వూవుకు అలవాటు... ఆవిడ సిగ్గుపడుతూ చెప్పింది. ఆవిడ పేరు సరోజిని.

'అదిదా మీ భార్యాభర్తల్నిచూస్తే నాకు పట్టిన (నచ్చిన) విషయం ప్రేమ పక్షులంటారు చూడండి, అట్లా వుంటారు మీరిద్దరూ...' ఆరుముగం కాఫీ సిప్‌చేస్తూ అన్నాడు. 'మీకు ఏం కావాలన్నా, వూ ఆడవాళ్ళని అడగండి, సంకోచం అక్కర్లేదు. క్లినిక్కి వస్తుంది అబ్బాయి కూడా తోడుగా వుంటాడు...' అన్నాడు ఆవిణ్ణి చూస్తూ.

కృతజ్ఞతా పూర్వకంగా ఆమె ఆయన వంక చూసింది. మనస్సులో ఏదో చెప్పలేని భయం. భర్తకు తెలియకుండా పెద్దబ్బాయికి ఉత్తరం వ్రాసింది, నాన్నగారి కంటి ఆపరేషనుకి సహాయం చెయ్యమని కోరుతూ... వీలయితే నాలుగు వేలయినా డ్రాఫ్టు మూలంగా పంపమని అడిగింది.

తోచిన సహాయం అర్థిస్తూ చిన్నవాడికి కూడా వ్రాసింది. భర్తకు తెలిస్తే తప్పక అగ్నిహోత్రావదాన్లు అవుతాడని అనుకుంది. భయపడింది.

'కలకలప్పుగా (గలగలమంటూ) మాట్లాడే మామి కవలగా (విచారంగా) కనిపిస్తున్నారు...'

'అబ్బే అదేమీ లేదండి.' ఆవిడ అంది నవ్వుతెచ్చుకుని.

'మీరేమీ కవల పడకండి. ఆ మురుగన్ దయవల్ల ఆపరేషన్ చక్కగా జరుగుతుంది. మేమంతా వున్నాము...' అంటూ ఆరుముగం సెలవు తీసుకుని వెళ్ళాడు. వెడుతున్న మిత్రుని వైపు ఆయన కళ్ళప్పగించాడు. ఆవిడ ఖాళీ గ్లాసులు లోపలికి తీసుకువెళ్ళింది.

అనుకున్న రోజున ఆయనకి ఆపరేషన్ సవ్యంగా జరిగింది. బెడ్డుకితీసుకు వచ్చేంతవరకు ఆయన భార్య, ఆరుముగం కొడుకు అక్కడే వున్నారు. మధ్యమధ్య ఆపరేషన్ చేసిన డాక్టరుగారు వచ్చి చూసి వెళ్లారు.

సాయంకాలమవుతోంది.

'సరూ, భోజనం చేశావా?' ఆయన నవ్వుతూ అడిగినందుకు ఆవిడకి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. ఈ మధ్యకాలంలో ఆయన అంత ఆప్యాయత ప్రకటించలేదు. ఆమె బదులు చెపుతుంటే, ఫ్లాస్కుతో ఆరుముగం కొడుకు వచ్చాడు కాంటీను నుంచి, డబ్బులివ్వబోతుంటే 'వద్దు మామి' అన్నాడతను.

'తీసుకోబాబు...'

'వద్దుసార్... మా నాయనగారు రెండువందలిచ్చివెళ్ళారు... మీకు అవసరమైనవి తెచ్చి యివ్వమన్నారు...'

ఆరుముగం సౌజన్యాన్ని తలచుకుని ఆయన లోలోన తన్మయత్వం చెందాడు. నిజమైన స్నేహానికి గల విలువను ఏ షరాబు లెక్కకట్టలేడని అనుకున్నాడు.

'నావల్ల మామికి భోజనం లేటయింది...' అంటూ రూం తలుపు మెల్లగా తెరిచి లోపలికి వచ్చింది ఆరుముగం భార్య. 'మురుగన్ దయవల్ల

మామకు ఆపరేషన్ కాంప్లికేషన్స్ లేకుండా జరిగింది. అద్దామనకు కావలసింది... నిండా సంతోషం...

ఆయన లేవడానికి ప్రయత్నించాడు.

'వద్దు మామా.' మీరు పడుకోండి.

'ఇలా కూర్చోండి' అంటూ ఆమె కుర్చీ చూపించింది.

'నిండా లేటయింది. మీరు భోజనం చెయ్యండి...'

ఆరుముగం భార్యమాటలోని అప్యాయత ఆమెకు భోజనంచేసి త్రేన్చినంత సుఖం కలిగించింది. పైగా కడుపుదహించుకుపోతోంది, ఆకలికి... కులాభిమానం అడ్డు తగిలింది, సైంధవుడిలా.. ఆమె తటపటాయించడం చూసి.

'మేముదా శైవపిళ్లైలం... మామకు తెలుసు... మాయింట్లో ఎగ్ కూడా దొరకదు.

'అవును మీ యింట్లో నేను భోజనం చేశాను. ఆవిడ కొడుకు దగ్గరకి బొంబాయి వెళ్ళినపుడు...; ఆయన అన్నాడు. 'మామికి కొంచెం పట్టింపు...'

'అబ్బే, అదేమీ లేదు. బొంబాయి వెళ్ళినపుడు రైల్లోనే టిఫిను భోజనం అన్నిను...' 'ఆరుముగం భార్య తెచ్చిన భోజనం చేసేందుకు ఆమె సుముఖంగా వున్నట్టు కనిపించింది.

'మామీ, మీకోసం స్పెషల్గా మామిడికాయ చట్నీ ముక్కల పులుసు చేసి తీసుకొచ్చా.'

వింటుంటే ఆయనకే నోరూరింది.

ఆవిడ భోజనానికి కూర్చుంది.

'మామీ, చెప్పడం మరచిపోయా, మీకో లెటరు వచ్చింది' అంటూ ఆరుముగం భార్య ఒక కవరు యిచ్చింది.

కూర్చున్నదల్లా లేచి, చెయ్యి కడుకుని ఆవిడ కవరు చింపింది. ఉత్తరం చదవసాగింది లోలోపల.

'ఎక్కణ్ణుంచి?' ఆయన ప్రశ్నించాడు. పచ్చివెలక్కాయ గొంతులో ఇరుక్కునట్లనిపించింది ఆవిడకి. ఉత్తరం మీద ధ్యాస నిలవేదు. సమాధానం చెప్పక తప్పింది కాదు. 'బొంబాయినుండి.'

'అంతా సౌఖ్యం దానే అక్కడ?' నవ్వుతూ అడిగింది ఆరుముగం భార్య.

''నా ఆపరేషన్ గురించి రాయొద్దన్నానుగదా? నాకు తెలీకుండా ఎందుకు రాశావు?''

'అదేం మాట మామా! తండ్రికి ఆపరేషన్ జరుగుతుంటే పిన్నోళ్ళకి తెలపకపోతే ఎట్టా?'

'అలా అడగండి ఆయన్ని' మీ మామకు చెప్పకుండా ఉత్తరం రాశానని ఆయనికి నామీద కోపం...' భర్తపట్ల కలిగిన కోపాన్ని తెలియజేసేందుకు అవకాశం కలిగినందుకు ఆవిడకి కొంచెం తృప్తి కలిగింది. కాని ఉత్తరంలోని విషయాలు మనస్సుని బాధించాయి. ఆ బాధను కప్పి పుచ్చుకునేందుకు రూం వెలుపల వున్న బాత్‌రూంకి దారి తీసింది. ఆవిడ ముఖంలో వచ్చిన మార్పుని గమనించిన ఆరుముగం భార్య ఆవడని అనుసరించింది.

ఆమెను చూడగానే ఆవిడ కళ్ళనీళ్ల పెట్టుకుంది. 'చూశారా, మా పెద్దవాడు ఏం రాశాడో, వాడి పిల్లవాణ్ణి స్కూల్లో వెయ్యాలిట. డొనేషన్ కట్టాలిట. అయిదారు వేలయినా వాడికి ప్రస్తుతం అవసరమనీ, మా కోడలికి అనరోగ్యంగా వుందనీ మందు మాకులకింద బోలెడు ఖర్చవుతోందనీ రాశాడు. వాడిమీద ఆశ పెట్టుకున్నందుకు చివరికి నిరాశే మిగిలింది...'

'మామీ, ఊరుకోండి, ఈ మాత్రానికే అధైర్యం పడతారా? మేము చూస్తూ కూర్చుంటామా చెప్పండి...' ఆమె ఓదార్చింది.

ఆవిడ కళ్ళు తుడుచుకుని రూంలోకి వచ్చింది. ఆవిడ కళ్లు చూసే ఆయన ఉత్తరంలోని విషయం గ్రహించాడు.

'నేను వద్దు వద్దంటున్నా రాశావు. ఇప్పుడు విచారించి ఏం లాభం చెప్పు? వాడు సహాయం చెయ్యకపోతే, యింకెవ్వరు సహాయం చెయ్యరని అనుకుంటున్నావా? పిచ్చిదానా...'

'అలా చెప్పండ మామా! మామికి ధైర్యం తక్కువ...' ఆరుముగం భార్య బొంబాయి ఉత్తరంలోని విషయాలు ముక్తసరిగా చెప్పింది.

'ఉత్తరం రాయొద్దని నేను గట్టిగా చెపుతూనే వున్నా, మాట వినకుండా రాసింది మీ మామి...'

'కన్న పిల్లకాయలతో అంతఖండితంగా వుండటం సాధ్యపడదు మామా, సహాయం చేస్తురని మామి ఆశ...'

'నిజమే నమ్మా, కాని ఎవరి కుటుంబాలు వారివే అయినప్పుడు ఎవరి ఖర్చులు అవసరాలు వారివే...'

'అట్లా అని మీరు చిన్నవాడికి సహాయం చెయ్యకుండా ఊరుకున్నారా చెప్పండి?' ఆవిడ సమయం చూసి కీలెరిగి వాత పెట్టింది.

ఆయన మౌనం వహించడంతో ఆవయడ మళ్ళీ అంది. 'పోయిన సంవత్సరం చిన్నవాడికి నాలుగు వేలు పంపించారు, వాడు అడగ్గానే, అదీ పెద్దవాడికి కోపం. అందుకనే వాడిప్పుడు సాకులు చెపుతున్నాడు.'

'చెపితే మామకు కోపం వస్తుంది కాని, చిన్నపిల్ల కాయంటే కొంచెం ప్రియం...' ఆరుముగం భార్య నవ్వుతూ చెప్పింది.

రూం తలుపు తెరిచిన చప్పుడయింది.

'ఇప్పుడే నీ సంగతి చెప్పుకుంటున్నాం... నూరేళ్ళాయిస్సు నీకు...'

'ఎవరు?'

'చిన్నబ్బాయండీ.'

'వచ్చాడూ...' ఆయన ముఖం చేటంత అయింది.

నానా అంటూ అతడు ఆయన బెడ్డుమీద కూర్చున్నాడు.

'కోడలూ, మనవరాలూ కులాసాగా వున్నారా?'

'కులాసాగానే వున్నారమ్మా.'

'చూడ్డానికి నువ్వైనా వచ్చావు. చాలా సంతోషం రా బాబు.'

'ఎవరికీ ఉత్తరం రాయద్దన్నారు మీ నాన్నగారు... ఉండబట్టలేక ఆయన మాటని కాదని నేనే రాశాను...' ఆమె మాటలో విజయగర్వం ప్రస్ఫుటమయింది.

'అనవసరంగా గాభరా పడతారని వద్దన్నాను...'

'చిన్న పిల్లకాయను చూసేసరికి మామకు ఎంతధైర్యం వచ్చిందో గమనించారా మామీ..? ఆరుముగం భార్య అతనిని చూస్తూ చెప్పింది.

''తలవంచుకుని కూర్చుంటే, మీ రెవరో అనుకున్నాను మామీ... ఏమీ అనుకోకండి... ఆరుముగం మామ సౌఖ్యంగా వున్నారా?''

''సౌఖ్యందా, అంతా మురుగున్ దయ.''

''ఆపరేషన్ వచ్చేనెల జరుగుతుందన్నారుగా. మరి తొందర పడ్డారు దేనికి?' అతను అడిగాడు.

'డాక్టరుగారు ఏదో కాన్ఫరెన్సుకని వచ్చేనెల లండన్ వెడతారట. కనుక యిప్పుడే చేస్తామన్నారు...' ఆయన కొడుకుని చూస్తూ అన్నాడు.

'పొరపాటు జరిగింది నానా..'

ఆయన మనస్సు గతుక్కు మన్నది.

'మరేం లేదు, పోయిన నెల మా మరదలి వివాహం జరిగింది గదా. అప్పుడు మా మామ గారు పదివేలు అర్జెంటుగా కావాలన్నారు. ఆఫీసులో లోన్ తీసుకుని పంపాను. ఆ లోన్ తీరందే మళ్ళీ కొత్తగా లోనుకి అప్లై చెయ్యడం మంచిదికాదు. ఇది నీకు తెలియందికాదు...' కొడుకు నీళ్ళు నమలడం చూసి ఆవిడ నిరుత్సాహపడింది.

'పోయిన సంవత్సరం నీకు నాలుగువేలు పంపాను, అడగ్గానే. గుర్తుందా?' ఆయన కంఠ స్వరంలో కొంచెం కరకుదనం తొంగి చూసింది.

'లేకేం! అమ్మాయి స్కూల్లో చేరుతోందంటే, డొనేషన్గానైనా పనికి వస్తుందని పంపావు. నేను కాదనడం లేదే...'

'అప్పుడు చేతిలో వుంది, పంపగలిగాను...'

'ఆ సహాయాన్ని నేను గుర్తుంచుకున్నాను.'

'గుర్తుంచుకున్నావు కనుక, యిప్పుడు నాకు సహాయం చెయ్యమని కోరుతున్నాను... నోరు విడిచి అడుగుతున్నాను.'

'మనవరాలంటే నీకు ముద్దు కనక, సహాయం చేశావనుకున్నాను. ఇలా అని తెలిస్తే, ఆ డబ్బు నేను ముట్టుకునే వాణ్ణికాను...'

కొడుకు మాటలు వినేసరికి ఆయనకి మతి పోయినట్లయింది. 'అదేమిట్రా బాబూ, అలా అంటావు!' అని తల్లి, కొడుకు ముఖంలోకి చూసింది.

ఉన్నట్లుండి వాతావరణం వేడెక్కడం చూసి ఆరుముగం భార్య మొదట్లో నిర్ఘాంతపోయినా, తర్వాత నొచ్చుకుంది. ఆ మాటలు వింటూ తానక్కడ వుండడం భావ్యం కాదనుకుంది. మళ్ళీ యేమనుకున్నదో యేమిటో, 'పెద్దాయన్ని అట్లా అనకూడదు బాబూ' అంది, అప్రయత్నంగా.

'అన్నయ్యా మాదిరి నేనూ యిక్కడికి రాకుండా ఏదో ఉత్తరం రాసుంటే సరిపోయేది... వచ్చి పొరపాటు చేశాను...' అంటూ లేచాడు కొడుకు. ముఖం కందగడ్డలా వుంది. 'రేపు డ్యూటీకి వెళ్ళాలి. వెళ్ళొస్తాను' అన్నాడు.

ఇంటికి వెడదాం పదరా బాబూ, భోజనం చేసి వెడుదువుగాని.' అంది తల్లి. ఆమాట కొడుక్కి వినిపించినట్లు లేదు.

'మామికే లేదనుకున్నా ధైర్యం. మీకూ లేదు... మీకు ఏం సహాయం కావాలన్నా చెప్పడం... నేనున్నాను. మా పిన్నోడు వున్నాడు...' అంది ఆరుముగం భార్య.

ఆమె వంక దీనంగా చూస్తూ 'ఇంటి దీపం గదా అనుకున్నా.. మీసాలు కాలాయి...' అయన అన్నాడు ప్రతి అక్షరం నొక్కి పలుకుతూ, నిద్ర రాకపోయినా, నిద్ర పోతున్నట్టు నటించాడు.

✦✦✦